



మంత్రిని కలిసిన కమిషనర్

నెల్లూరు :నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వై.ఒ నందన్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం నగరంలోని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో కలిసిన కమిషనర్ వై ఓబులేసు నందన్‌ను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా కమిషనర్ వై.ఒ నందన్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ నగరాభివృద్ధికి కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కార్పోరేషన్ పరిధిలో లబ్ది దారులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరాభివృద్ధికి చేపట్టే పనులల్లో సమస్యలేమైనా ఉత్పన్నమైతే తన దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామని చెప్పారు.



మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి పూల బొకే అందజేస్తున్న కమిషనర్ నందన్

మనల్ని ఎవడ్రా ఆపేది..!

◆ తెల్లరాయి మాఫియా దౌర్జన్యం
◆ మైనింగ్ అధికారుల మద్దతు
◆ పోలీసు, ఆర్‌డిఒ సరిహద్దులు దాటిస్తారు..
◆ రెవెన్యూ అధికారుల మొద్దు నిద్ర

"అధికార తెలుగుదేశం పార్టీ మైనింగ్ వ్యవహారంలో రోజు రోజుకు అప్రతిష్టపాలౌతోంది. అవినీతి అక్రమాలకు చెక్ పెడుతాం...తెల్లరాయి దొంగలను జైలుకు పంపుతాం... జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన అనుచరులు తెల్లరాయిలో వేల కోట్లు దోచుకున్నారు... సహజవనరులను కాపాడుతాం " అంటూ నాడు చెప్పిన నేతలు నేడు కళ్లకు కంతలు కట్టుకున్నారు...మైనింగ్, పోలీసు, ట్రాన్స్‌పోర్టు, రెవెన్యూ అధికారుల మద్దతుతో ఆధికారపార్టీనేతలు, ప్రజాప్రతినిధులు రాబందాల్లా మారిపోయారు... ఇటీవల మేజర్ మైనింగ్‌కు అప్పగిస్తున్నారని, అక్రమాలు జరగవని అందరూ భావించారు. ఏ ఒక్క అను మతులు లేకుండా యథేచ్ఛగా ఇప్పుడు సైదాపురం తెల్లరాయిని గొల్ల గొడుతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు నోరు మెదపడం లేదు. టిడిపి పెద్దల సహాకారంతో జరుగుతుందనే ప్రచారం సాగుతోంది. ధైర్యం చేసి ఏ ఒక్కరు సైదాపురం మైనింగ్ వైపు కన్నెతి చూడడం లేదు. ఇక్కడ రౌడీ మూకలను పెట్టి మరీ దౌర్జన్య కాండకు దిగుతున్నారని తెలుస్తోంది. టిడిపి పెద్దల హస్తం ఉందనే ప్రచారం సాగుతోంది. లీజ్‌దారులు ఈ పరిణా మాలను మౌనంగా చూస్తున్నారు. వైసిపి ప్రభుత్వంలో మంత్రులు, ఎంఎల్‌ఎలు, స్థానిక నేతలు దోచుకుతిన్నారు. తామేమి తక్కువ కాదంటూ టిడిపి నేతలు వ్యవహరిస్తున్నారు.

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

సైదాపురం ఒకప్పుడు మైకాకు ప్రసిద్ధి...ఇప్పుడు తెల్లరాయితో మళ్లీ తెరమీదకు వచ్చింది.. ఏన్నో ఏళ్ల నుంచి ఇక్కడ గనులున్నప్పటికీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ సమయంలో ఒక్కసారిగా తెల్లరాయి బంగారంగా మారింది. టన్ను రెండు,మూడు వేల నుంచి ఏకంగా రూ 20 నుండి 30 వేలకు చేరిన విషయం తెలిసిందే. అప్పటి వైసిపి ప్రభుత్వంలోని పెద్దలు సిఎం కార్యాలయం వేదికగా అవినీతికి తెరతీశారు. రెవెన్యూ, మైనింగ్, పోలీసులను చేతిలో పెట్టుకొని సైదాపురం నుండి చైనాకు భారీగా తెల్లరాయి అమ్ముకున్నారు. సిఎం కార్యాలయం, మంత్రులు, ఎంఎల్ఎలు, నేతలు కలిసి అందినకాడికి దోచుకున్నారు. గత ప్రభుత్వంలో వేల కోట్లు తరలిపోయిందనే ప్రచారం జరిగింది. వైసిపి ప్రజాప్రతినిధులు, నేతలు కలిసి పంచుకున్నారని ఆపార్టీ నేతలె చెబుతారు. అప్పట్లో మైనింగ్ లీజ్ దారులను బెదిరించి తరిమేశారు. ప్రభుత్వ, ప్రయివేటు, పట్టా, భూమి ఎక్కడ కనిపిస్తే అక్కడ తవ్వకాలు చేశారు. పంపకాల వద్ద వైసిపి నేతల మధ్య రగడ సాగింది. ఎన్నికలకు ఆరు నెలల ముందు 'ప్రజాశక్తి'తోపాటు అనేక పత్రికలు ఇక్కడ అవినీతిని వెలికి తీశాయి. రాష్ట్రమంతా చర్చసాగింది. ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ జిల్లానేతలతో చర్చించారు. అవినీతిని ప్రశ్నించరా,?. సహజవనరులు కొల్లకొడుతుంటే చూస్తుంటారా ? అంటూ క్లాస్ తీసుకున్నారు. నారా లోకేష్ పాదయాత్ర సందర్భములోనూ తెల్లరాయి దొంగలను జైలుకు పంపుతామని హెచ్చరించారు. తాము అధికారంలోకి వస్తే లీజు దారులకు న్యాయం చేస్తామని, అక్రమార్కులను జైలుకు పంపుతామని హామీ ఇచ్చారు. చినబాబు వస్తే మా రాతలు మారిపోతాయని భావించిన లీజుదారులు బోరుమం టున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా మైనింగ్ వ్యవహారం తేలడం లేదు. ఇటీవల మేజర్ మైనింగ్‌కు ఈ వ్యవహారం వెళ్లినా సైదాపురంలో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదు. అదికార టిడిపి నేతలు వైసిపి నేతలకన్నా ఎక్కువ చేస్తున్నారని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

మనల్నీ ఎవడ్రా అపేది..ఆపేది..

వైసిపి ప్రభుత్వానికి, టిడిపికి పెద్దగా తేడా కనిపించడం లేదని సైదాపురం ప్రాంతంలోని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. అప్పుడు సైదాపురం మైనింగ్‌లో ఏం జరిగిందో ఇప్పుడు అదే కొనసాగుతొందని విమర్శలున్నాయి. ఎన్నికల అనంతరం మైనింగ్ లీజ్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. నూతనంగా చట్టం తీసుకొచ్చి సహజవరులు దోపిడి జరగకుండా చూస్తామంటూ చెప్పుకుంది. వైసిపి ప్రభుత్వంలో ఒరిజనల్ మైనింగ్ లీజ్‌దారులు పెద్ద ఎత్తున నష్టపోయారు. ప్రభుత్వం మారితే మా పరిస్థితి మారుతుందని ఆశపడ్డారు. ప్రభుత్వం బోర్డు మారింది తప్ప, పరిస్థితులు అలాగే కనిపిస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. టిడిపి అధికారంలోకి వచ్చికా నెల్లూరుకు చెందిన కొందరు అదికారపార్టీ నేతలు సైదాపురం మైనింగ్‌లో దొపిడి మొదలు పెట్టారు. మీడియా, ప్రజల్లో వ్యతిరేకత వస్తుందని ఇటీవల మైనింగ్‌కు మేజర్ మైనింగ్‌కు కలిపి డిల్లీకి పంపారు. ఐబిఎం (ఇండియన్ బూర్యో ఆఫ్ మైనింగ్) వద్ద అనుమతులు తీసుకొని పనులు చేసుకోవాల్సి ఉంది. ఎక్కడా అను మతులు తీసుకోలేదు. అధికారపార్టీ నేతలనే ఒకే ఒక ముద్రతో ఏద్దేచ్చగా తెల్లరాయి కొల్లకొడుతున్నారు. టిడిపికి చెందిన కొందరు నాయకులు, సైదాపురం మండలం జోగుపల్లికి చెందిన ఓ వ్యక్తి కనుసైగ్లో మొత్తం వ్యవహారం జరుగుతుందనే ప్రచారం సాగుతొంది. ప్రతిరోజు పెద్ద సంఖ్యలో ఇక్కడ నుండి తెల్లరాయి తరలిపోతొంది. చెన్నెయ్, అక్కడ నుండి చైనాకు వెళ్తోంది. ప్రతి రోజూ లారీలు ఇక్కడ దర్శనమిస్తున్నాయి. వీటిని అరికట్టాల్సిన అధికారులు నోరు మెదపడం లేదు. మైనింగ్ అధికారులు అధికారపార్టీ నేతలకు ఊడిగం చేస్తున్నారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. పోలీసులు , ట్రాన్స్‌పోర్టు అధికారులు దగ్గరుండి వాహనాలు సరిహ ద్దులు దాటిస్తున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు అదికారపార్టీ నేతలకు భయపడి వణికిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వాస్తవంగా మైనింగ్ లీజుదారులు మౌనంగా ఇళ్లలో కూర్చుంటున్నారు. వెంకటగిరి రాజాలకు కలిచేడు వద్ద భారీ మైనింగ్ ఉంది. ఎన్నికల తరువాత వారు ఇక్కడ తొంగిచూడడం లేదు. టిడిపి ప్రభుత్వంలో నూతన మైనింగ్ పాలసీ వచ్చి అందరికీ న్యాయం జరుగుతుందని అందరూ భావించారు. అధికారపార్టీ నేతలు కొందరు పార్టీ పేరు చెప్పి దౌర్జన్యాలకు దిగుతున్నారని తెలుస్తోంది. వైసిపి, టిడిపి దొందు దొందే అన్నట్లు వ్యవహారం సాగుతొంది.



సైదాపురంలో అడ్డుఅదుపు లేకుండా తవ్వకాలు చేస్తున్న దృశ్యం



అక్రమంగా తరలించడానికి సిద్ధమైన తెల్లరాయి

మధుసూదన్ కుటుంబానికి

రూ.10 లక్షలు సాయం

ప్రజాశక్తి - కావలి

కాశ్మీర్‌లోని పహల్ గామ్ ఉగ్రవాద ఘటనలో మతి చెందిన సోమిశెట్టి మధుసూదనరావు కుటుంబానికి అండగా ఉంటామని నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్‌సి బీద రవిచంద్ర తెలిపారు. ఆదివారం కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి తో కలిసి మధుసూదన రావు కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. మధుసూదన్ చిత్రపటానికి నివాళుఅర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 10లక్షలరూపాయల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. మధుసూదన్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఉగ్రవాద చర్య జరగడం చాలా దుర దష్టకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున వారికి అందాల్సిన సదుపాయాలను అందజేసే ప్రయత్నం చేస్తామని తెలిపారు. అవసరమైతే కుటుంబంలో ఒకరికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కషి చేస్తామని తెలిపారు. ప్రధాని నరేంద్రమోడీ తీసుకునే నిర్ణయాలకు తామంతా కట్టుబడి ఉన్నామన్నారు. దేశంలో ఉగ్రవాదాన్ని ఏరిపారే యాల్సిన అవసరముందన్నారు.ఎంఎల్‌సి బీదా రవి చంద్ర మాట్లాడుతూ పాకిస్తాన్ చర్యలను ప్రతి ఒక్కరు కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన అవసం ముందన్నారు. ఉగ్రవాదాన్ని అణిచివే సేందుకు భారతదేశం ఏకం కావాలన్నారు. వారి కుటుంబానికి మాప్రగాఢసానుభూ తి తెలియజేస్తు న్నామన్నారు. కార్యక్రమంలో కావలి ఆర్‌డిఒ ఎం. సన్నీ వంశీ కష్ణ, నుడా ఛైర్మన్ కోటం రెడ్డి శ్రీనివాసులురెడ్డి, మధుసూదన్ కుటుంబ సభ్యులు ఉన్నారు.



మధుసూదన్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎంపి వేమిరెడ్డి, ఎంఎల్‌సి బీద రవిచంద్ర, ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి

పేదరికం లేని సమాజం కోసం కృషి : కలెక్టర్

ప్రజాశక్తి-నెల్లూరు :పేదరికం లేని సమాజం కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన మార్గదర్శి - బంగారు కుటుంబం పథకంలో ఆసక్తి ఉన్నవారు స్వచ్ఛందంగా భాగస్వాములు కావచ్చని కలెక్టర్ ఆనంద్ అన్నారు. ఆదివారం ఆయన మార్గదర్శి - బంగారు కుటుంబం పథకం గురించి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులలో అవగాహన కల్పించారు.కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు ఒక లక్ష కుటుంబాలు పి4లో సాయం అవసరం ఉన్న కుటుంబాలుగా గుర్తించడం జరిగిందన్నారు .ప్రభుత్వ ఉద్యోగులు, పారిశ్రామి కవేత్తలు, ధనికులు , సేవా భావం కలిగిన వారు ఈ పథకంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావచ్చు న్నారు. జిల్లాలోప్రతి శాఖ కనీసం 10 మందిని మార్గదర్శి- బంగారు కుటుంబం పథకంలో పేదవారికి సహకారం అందించే విధంగా భాగస్వాములయ్యేటట్లు అవగాహన కల్పించాలన్నారు. ఎవరినీ బలవంతంగా ఈ పథకంలో చేర్చవద్దని, ఇది కేవలం స్వచ్ఛంద పథకమేనన్నారు. సిఎం చంద్రబాబునాయుడు పిలుపుమేరకు ఈ పథకంలో అవకాశం ,ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ పేదరిక నిర్మూలనలో భాగస్వాములై పేదరికం లేని జిల్లాగా మార్చాలన్నారు.

ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :తెలుగు తమ్ముళ్లకు పోలీసులు షాక్ ఇచ్చారు. అక్రమంగా మట్టిని తరలి స్తున్న ట్రాక్టర్లను సీజ్ చేశారు. తోటపల్లిగూడూరు మండలం వరిగొండ గ్రామానికి చెందిన తెలుగు తమ్ముల్లు అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను శనివారం రాత్రి పోలీసు లు స్వాధీనం చేసుకొన్నారు. మల్లి ఖార్జు నపురం గ్రామం నుంచి అక్ర మంగా మట్టిని తరలిస్తున్న ట్లు స్థాని కులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో మట్టిని డం ప్ చేసి వస్తున్న ఖాళీ ట్రాక్టర్లను పో లీసులు అదుపులోకి తీసుకున్నా రు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినప్పటి నుంచి తెలుగు త మ్ముళ్ళు రెచ్చిపోతున్నారు. అక్రమ మట్టి దోపిడీకి తెరలేపుతున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా చేపడుతున్న మట్టి తరలింపులకు అడ్డుకట్టవేయాల్సిన సంబంధిత శా ఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఆహ్వాన పత్రిక అందజేత

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం లో జరిగే దివ్య కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికను దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి సుబ్బారావు ,సిబ్బంది ఆదివారం అందజేశారు.మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పలు విషయాలువారితో చర్చించారు.

రహదారి ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లూరు : రూరల్ నియోజకవర్గ పరిధిలోని తాటిపర్తి రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని టిడిపి నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ రహదారి ప్రారంభోత్సవ కార్యక్రమంలో రూరల్ ఎంఎల్ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నాయకులు మాట్లాడుతూ సిఎం నారా చంద్రబాబునాయుడు ఆశీస్సులతో, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి,జిల్లా అధికారుల సహాకారంతో ఈ రహదారి నిర్మాణం సకాలంలో పూర్తి చేయగలిగామన్నారు. పొట్టేపాళెం, ములుమూడి కలుజు మీద బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు ఇచ్చేందుకు కృషి చేయాలన్నారు. కేవలం రూ.6 కోట్లు నిధులు విడుదల చేసేందుకు నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి ఉన్నారు.

19వ డివిజన్ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-నెల్లూరు : రూరల్ నియోజకవర్గం లో జరుగుతున్న అభివద్ధిలో 19వ డివిజన్ ను అగ్ర భాగాన నిలిపామని టిడిపి నాయకులు నూకరాజు మదన్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ముత్యాలపాలెం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశం మాట్లాడుతూ 19వ డివిజన్లో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించామన్నారు. అరవింద్ నగర్ ఎక్స్టెన్షన్ తో పాటు ముత్యాల పాలెం లో రోడ్లు, డ్రైనేజీలు, గోమతి నగర్ మెయిన్ రోడ్డు పనులు పూర్తి చేశామన్నారు. మాగుంట లేఔట్ వద్ద ఎన్నో ఏళు గా వర్షం నీటి సమస్య ఉందని ఈ ప్రాంతంలో డ్రైనేజీ ఇతర అభివద్ధి పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి , టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సహకారంతో 19 డివిజన్ నేడు అత్యంత సుందరంగా తయారైందన్నారు.

ఘనంగా పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కందుకూరు

సాదు మాల్యాద్రి రచించిన ఇండియా లో ఇప్పుడు ఏం చేయాలి? పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం కందుకూరు స్వర్ణ . ప్యాలస్ హల్ ఆదివారం కె.మోహనరావు అధ్యక్షత న జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రో..అబ్దుల్ నూర్ బాషా ఇండియా లో ఇప్పుడు ఎం చేయాలి పుస్తకాన్ని అవిస్కరించటం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్త గా విచ్చేసిన జి.లక్ష్మీ నరసయ్య పుస్తక పరిచయ కార్యక్రమం చేస్తూ ఈ పుస్తకం చాలా వాడి వేడిగా ఉంది అని సాదు మాల్యాద్రి తాను జీవితం అంతా పోరాటం మారోజు వీరన్న కొనసాగింపు ఈ పుస్తకం ...ఐడెంటిటీ అలయెన్స్ దిశగా దళిత బహుజనులు అడుగులు ముందుకు వేయాలని పిలుపు నిచ్చాడు. విసికె పార్టీ రాష్ట్ర అధ్యక్షులు యన్ జె.. విద్యాసాగర్ మాట్లాడుతూ దళిత బహుజనులు అందరూ రాజ్యాధికార దిశగా మన వోట్లు మనం వేసుకుని అధికారం హస్త గతం చేసుకోవాలని సూచించారు. బద్దిపూడి జయరావు. లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు యం.బుద్ధకోటి,డి చార్వాక,ఎరుకుల సంఘం నాయకులు యన్. మోహన్ కుమార్ ధర్మ,బీఎస్పీ కందుకూరు ఇన్చార్జి పెరం సత్యం, సామాజిక పాలేటి కోటేశ్వరరావు,.బొక్క వేంకటేశ్వర్లు (బీవీ), సహజ నందం తదితరులు పాల్గొన్నారు.



పట్టా భూములతో సమానంగా

అసైన్‌మెంట్ భూములకు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -గుడ్లూరు రూరల్ : 2013 చట్టం ఆధారంగా పట్టా భూములతో సమానంగా అసైన్మెంట్ భూములకు ఎకరాకు రూ. 23 లక్షల పరిహారం చెల్లించాలని చేవూరు నిర్వాసితుల సమస్యల సాధన కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం చేవూరు సాయి పబ్లిక్ హై స్కూలు ఆవరణలో, బాసం వెంకటేశ్వర్లు అధ్యక్షతన సాధన కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, 2013 చట్టంలో పట్టా భూములతో సమానంగా అసైన్మెంట్ భూములు నష్ట పరిహారం చెల్లించాలని ఉన్నప్పటికీ, చట్టాన్ని విస్మరించి, ఎకరాకు 21 లక్ష, 80 వేలు ఇవ్వడం సరికాదన్నారు.. వెంటనే ప్రభుత్వ అధికారులు జోక్యం చేసుకొని ఎకరాకు రూ. 23 లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి కాలంలో రెవెన్యూ అధికారులు అనేక అవకతవకలకు పాల్పడ్డారని, దీనివలన దళితులు తీవ్రంగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అక్కిలగుంట అన్నయ్యకు అన్ని హక్కులు ఉన్నప్పటికీ, రెవెన్యూ అధికారుల చేతివాటం వల్ల అక్కిల గుంట చిన్నమ్మ, వెంకమ్మ అనువార్లకు, వీలునామా ఉంది అనే పేరుతో వారి అకౌంట్లో నగదు జమ చేయడం ఎంతవరకు సబబు అని ఆయన అధికారులను ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి, తిరిగి వాళ్ళ దగ్గర నుండి డబ్బు వాపస్ తీసుకొని అక్కిల గుంట చిన్నయ్యకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రామాయ పట్నం పోర్టు రోడ్డు నిర్మాణం కోసం, దళితులు ఇచ్చిన భూములు సర్వేనెంబర్ 553 ,591, లకు, రాతి చెరువు మల్లాయగుంట భూములకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. గతంలో రెసిడెన్షియల్ జోన్ లో ఉన్న, 582, 583, 586 లలో ఉన్న పొలాలకు ఫిబ్రవరి 28వ తేదీన భూసేకరణ చేస్తామని నోటిఫికేషను ఇచ్చారని,సర్వే నెంబర్లను భూ సేకరణ నుండి మినహాయించి తిరిగి, డి నోటిఫికేషన్ ఇవ్వాలని ఫర్ డిమాండ్ చేశారు. ఇక్కడ నెలకొన్న సమస్యలన్నింటి పరిష్కారానికి మే 5వ తేదీన, సబ్ కలెక్టర్ కార్యాలయం ధర్నా చేస్తా మన్నారు. ఎన్ వెంకటేశ్వర్లు, ఇరువురి బ్రహ్మయ్య, యల్లంటి వెంకటేశ్వర్లు, రమణారావు, పిచ్చయ్య, చేవూరి రాజగోపాల్, అక్కిల గుంటదానియేలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

'పది' విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి-కందుకూరు

మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తున్న నాగార్జున పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి అభినందనలు అని ముస్లిం ఐక్యవేదిక, జాషువా సాహిత్య సాంస్కతిక సంస్థ, దమ్మచక్ర ఫౌండేషన్ నాయకులు తెలిపారు. ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో అత్యున్నతమైనటువంటి ర్యాంక్ సాధించిన మైనారిటీ బాలిక షేక్ హీనాను ఆదివారం స్కూలు ఆవరణంలో కలిసి అభినందనలు తెలిపారు. ముస్లిం ఐక్యవేదిక నియోజకవర్గం అధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ పేద మైనారిటీ వర్గ బాలికలను చదువుల్లో రాణించే విధంగా ప్రోత్సహించి రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించే విధంగా కషి చేస్తూ మట్టిలో మాణిక్యాలను వెలికి తీస్తున్నారని స్కూల్ డైరెక్టర్ షాలిని రెడ్డిని అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి,సామాజిక వర్గానికి సేవలు చేయాలని ఉత్తమ ఫలితాలు సాధించిన ర్యాంకర్ ఎస్.కె హీనాకు శుభాకాంక్షలు తెలిపి బహుమతిని అందించారు . దమ్మచక్ర ఫౌండేషన్ అధ్యక్షులు గాండ్ల హరిప్రసాద్ అంబేద్కర్ జీవిత చరిత్ర పుస్తకాన్ని బహుకరించారు. జాషువా సాహిత్య సాంస్కతిక సంస్థ కార్యదర్శి చనమాల కోటేశ్వరరావు డైరెక్టర్ షాలిని రెడ్డిని,హీనాను సత్కరించారు. రిటైర్డ్ సబ్ ఇన్స్పెక్టర్ షేక్ షబ్బీర్ అహ్మద్ శుభాకాంక్షలు తెలిపారు. సయ్యద్ ఉస్మాన్, లాలు, మిలిటరీ రియాజ్, షేక్ ఖాజా హుస్సేన్, ఎస్.డి.పి.ఐ మౌలానా అసదుల్లా, యస్. కె.మదర్, అలంకార్ జహంగీర్, షేక్.జిలాని, టైలర్ మహబూబ్ బాషా, షేక్.జహంగీర్ మలాంగ్, షేక్ రఫీ, న్యాయవాది ముప్పవరపు కిషోర్, యాజమాన్యం మర్రెడ్డి, కరణం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు షేక్ సోఫియా, షేక్ షాహినా తదితరులు పాల్గొన్నారు.



ఉత్తమ ప్రతిభ చూపిన హీనాని అభినందిస్తున్న దృశ్యం

'ఉగ్ర'దాడులను ఖండించండి..

సిపిఎం

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు సిపిఎం పట్టణ కమిటీ సమావేశం సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు మాజీ సిపిఎం కౌన్సిలర్ ఎన్ కోటేశ్వరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఉగ్రవాద దాడుల్లో చనిపోయిన వారికి నివాళు లర్పించారు. దోషులను కఠినంగా శిక్షించాలని ఉగ్రవాద దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన, దాడికి గురైన కుటుంబాలను అదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఐ గౌస్ మాట్లాడుతూ మే ఒకటో తేదీన కందుకూరు పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో మేడే కార్యక్రమాలు జరుగుతాయని సుందరయ్య నగర్ ,ఉప్పు చెరువు ,అంబేద్కర్ బొమ్మ వద్ద ఉన్న సిపిఎం జెండాను ఉదయం 7 గంటలకు ఆవిష్కరించుకొని సిపిఎం కార్యాలయం వద్ద ఉన్న జెండా ఆవిష్కరిస్తామని తెలిపారు. ఆ సందర్భంగా చేపట్టే ప్రదర్శనను జయప్రదం చేయాలన్నారు. 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ఎస్.కె మున్వర్ సుల్తానా ,టి వెంకట్రావు ,ఎస్ పవన్ కుమార్ ,సుందరయ్య నగర్ శాఖ కార్యదర్శి ఎస్ కే మల్లికా, ఉప్పు చెరువు శాఖ కార్యదర్శి ఎం పద్మ ,డి ఎం రాయుడు పాల్గొన్నారు.



విద్యుత్ సమస్యలు పరిష్కరించరూ..

ప్రజాశక్తి - వలేటివారిపాలెం : మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ సమస్యలు అనేకం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులకు అవేమీ పట్టడం లేదు. తమకు వ్యక్తిగతంగా ఆదాయం వచ్చే సమస్యల పట్ల మాత్రం సిబ్బంది ప్రత్యేకంగా స్పందిస్తారన్న విమర్శ సంబంధిత శాఖ సిబ్బందిపై ఉంది. మండలంలోని సింగమనేనిపల్లి, పోకూరు, కొండసముద్రం, అంకభూపాలపురం, తదితర గ్రామాలలో నెలకొన్న విద్యుత్ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియడం లేదని ప్రజలు చెబుతున్నారు. ఒకవేళ తెలుసుకొని మండల కేంద్రంలోని కార్యాలయానికి వస్తే అక్కడ సిబ్బంది మీ గ్రామ సచివాలయాలలోనే కరెంటు సిబ్బంది ఉన్నారు.. కలవండని ఉచిత సలహా ఇచ్చి పంపుతున్నారు. సచివాలయాలకు వస్తే అక్కడ ఎనర్జీ అసిస్టెంట్లు ఎప్పుడూ అందు బాటులో ఉండరు. ఇటీవల వీచిన ఈదురుగాలులకు మండలంలోని కొత్తకొండసముద్రం సమీపాన పాతూరుకు వచ్చే దారిలో తూర్పు వైపున పొలాలలో ఇటీవల వీచిన ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయి కరెంటు తీగలు జామాయిల్ తోటల మీదకు పడిపోయాయి. దీంతో తరచూ గ్రామంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ఈ సమస్య వల్లనే గ్రామస్తులకు నీరు కూడా సరిగా సరఫరా కావడం లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని కొత్త కొండసముద్రం గ్రామంలో విద్యుత్ తీగలు జామాయిల్ తోటలపై పడి ఉన్న సమస్యను ఏ ఈ మధుబాబు దష్టికి తేగా గ్రామానికి వెంటనే సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు.



పంట పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు

మేడేను జయప్రదం చేయండి..

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు టౌన్ ఆటో వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వర్గ సమావేశం మద్దులూరి నరసింహం అధ్యక్షతన ఆదివారం జరిగింది. యూనియన్ కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే కందుకూరు పట్టణంలో కందుకూరు టౌన్ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగు తుందని పట్టణంలో ఉదయం ఏడు గంటలకు మేడే కార్యక్రమం ప్రారంభం అవుతాయని మొదటగా కోటారెడ్డి హాస్పిటల్ వద్ద ఉన్న ఆటో యూనియన్ ఆఫీసు వద్ద ఉన్న జెండా ఆవిష్కరణ జరుగుతుంది.అనంతరం గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద ఉన్న జెండా ఆవిష్కరణ, కోవూరు రోడ్డు ఆర్టీసీ డిపో వద్ద ఉన్న జెండా ఆవిష్కరణలు జరుగుతాయని తెలిపారు. కోటారెడ్డి ఆటో వర్కర్స్ యూనియన్ ఆఫీస్ నుండి కొవ్వూరు రోడ్డు వరకు ఆటో యూనియన్ స్టాండ్ వరకు వరకు ప్రదర్శన జరుగుతుందని తెలిపారు. అనంతరం అక్కడ సభ జరుగుతుందని తెలిపారు.కార్యదర్శి వర్గ సభ్యులు జి కోటేశ్వరరావు ,చెంచు రామయ్య, ఏసు, సిఐటియు నాయకులు ఎస్సే గౌస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

నేడు మంత్రి రవికుమార్ రాక

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు నియోజకవర్గ పర్యటనకి నేడు విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వస్తున్నట్లు ఎంఎల్ఎ ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు.సోమవారం ఉదయం 10 గంటలకు ఉలవపాడు మండలం మన్నేటికోట పంచాయతీలో మంత్రి రవికుమార్ ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తో కలసి 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనతరం ఉదయం 11.30 గంటలకు ఉలవపాడు మండలం బద్దిపూడి గ్రామంలో వారిద్దరూ నూతన సీసీ రోడ్లు , వాటర్ హెడ్ ట్యాంక్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు. ఉలవపాడు మండలం, బద్దిపూడిలో టిడిపిలో చేరికల కార్యక్రమం మంత్రి రవికుమార్ ఎంపి వేమిరెడ్డి పాల్గొంటారని నాగేశ్వరరావు తెలిపారు.

సేవాపురస్కారం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు జనార్ధన కాలనీలోని ఎంపిపి ఎస్ స్కూలు ప్రధానోపాధ్యాయురాలుగా జి. రామలక్ష్మమ్మ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆమె చేసిన వివిధ రకాల సేవలను గుర్తించి శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ వారు శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ప్రతిభా పురస్కారం తో ఆదివారం ఘనంగా సన్మానించారుఆల్ ఇండియా వాసవి సత్ర సముదాయాల మీడియా చైర్మన్ డాక్టర్ చక్కా వెంకట కేశవరావు రామలక్ష్మమ్మ సేవలను కొనియాడారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు రవ్వా శ్రీనివాసులు, పామూరు రోడ్డు కోదండ రామాలయం వైస్ ప్రెసిడెంట్ గుర్రం అల్లూరయ్య, వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



సేవా పురస్కారం అందుకుంటున్న రామలక్ష్మమ్మ

పలుచోట్ల నిరసన ర్యాలీలు



ప్రజాశక్తి-మర్రిపాడు: కాశ్మీర్‌లోని పెహల్గాంలో యాత్రికులపై జరిగిన ఉగ్రవాద దాడులకు నిరసనగా స్థానిక బస్టాండ్ సెంటర్లో ప్రజాసంఘాల నాయకులు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాల్ వెంగయ్య పాల్గొని మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన కావలి వాసి మధుసూధన్ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. దేశ ప్రజలందరూ ఉగ్రవాద దాడులను ఖండిస్తున్నారని, దేశ సమగ్రతను కాపాడుకోవడంలో భారతీయులందరూ కలిసికట్టుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రహంతుల్లా, వుల్లయ్య, హిందూ, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి - కావలి : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యు.టి.ఎఫ్)- జిల్లా కార్యదర్శి బి.హెచ్.ఎల్. ప్రసాద్ అధ్యక్షతన కావలి డివిజన్‌లోని అన్ని మండల శాఖల బాధ్యులు, రాష్ట్ర, జిల్లా బాధ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు ప్రశాంత భారతదేశంలో ఉగ్రవాదులు చేసిన దమనకాండలో అమరులైన భారతమాత ముద్దుబిడ్డలకు ఆత్మశాంతి కలగాలని, ఆ ఉగ్రవాదులను, మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని భారత ప్రభుత్వాన్ని కోరుతూ కావలి పట్టణంలో గాంధీ విగ్రహం వద్ద క్యాండిల్ నిరసన కార్యక్రమం నిర్వహించారు. తదుపరి పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు కెలారి వెంకటేశ్వర్లు, యు.టి.ఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యులు బి.శ్రీదేవి, జిల్లా కుటుంబ సంక్షేమ పథకం డైరెక్టర్ సి.ఆర్.ఎం.లక్ష్మి, కావలి డివిజన్‌లోని అన్ని మండల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఇందుకూరుపేట : పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా ఆదివారం మండలంలోని మైపాడు గ్రామంలోని యువత ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిరసనకారులు మైపాడులో మానవహారం చేపట్టి దాడికి గురైన మృతులకు సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెహల్గామ్ దాడి కేవలం 27 మందిపై జరిగిన దాడిగా కాదని భారతదేశంలోని 140 కోట్ల మంది పౌరులపైన జరిగిన దాడిగా అభివర్ణించారు. కార్యక్రమంలో మైపాడు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండలంలోని పలు గ్రామాలలో, ఆత్మకూరు నియోజక వర్గ స్థాయిలో భారతీయ పౌరులు కాశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతమైన పహల్గాం ప్రాంతంలో జరిగిన ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలను బలిగొన్న తీవ్రవాదులను తరిమి కొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆదివారం ప్రతిజ్ఞం కొవ్వొత్తులతో సంతాపం తెలియజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎఎస్‌పేట మండలంలోని మీడియా మిత్రులు, పత్రికా విలేకరులు, అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ఇట్రగుంట: జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఎం సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఆదివారం బోగోలు సిపిఎం కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు తుమ్మల వెంకయ్య, సిపిఎం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ గడ్డం మాల్యాద్రి మాట్లాడుతూ పహల్గాంలో ఘటనను హేయమైన చర్యగా అభివర్ణించారు. ఇటువంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా చూసేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి చల్ల నరసారి, కడమూరు శాఖ సిపిఎం కార్యదర్శి పోట్లూరి శ్రీనివాసులు, సిఐటియు ఉపాధ్యక్షులు బాదుల్లా, సిఐటియు కార్యదర్శి ఎస్.కె అన్సర్‌బాషా, రామయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-బిట్రగుంట : బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులను ఆదివారం నూతనంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు బర్నాబ్, గౌరవ అధ్యక్షుడిగా అశోక్, స్వర్ణ రాజ్, నూకసాని శ్రీనివాసులు, బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ కందురిప్తి శ్రీనివాసులు బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ క్రీడా మైదానంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పోలీస్ శాఖలో పనిచేస్తున్న ప్రభాకర్ రెడ్డి ట్రీట్‌మెంట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు నూకసాని శ్రీనివాసులు మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని డేటును కలుపుతామని, బిట్రగుంట రైల్వే బుకింగ్ కౌంటర్‌ను సోమవారం పునఃప్రారంభం చేస్తూ పనిచేస్తున్నందుకు సహకరించిన ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, కావలి ఎంఎల్ఏ కావ్య కృష్ణారెడ్డి, రైల్వే డివిజన్ అధికారులను సహకరించిన బిట్రగుంట ప్రజలకు వ్యాపారస్తులకు రైల్వే విశ్రాంత ఉద్యోగస్తులకు స్వచ్ఛంద సేవా సంస్థలకు అభివృద్ధి కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడా మైదానంలో పిల్లలకు ఉచితంగా కరాటే క్లాసులను ఇవ్వటానికి కరాటే మాస్టర్ రవి గన్ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మన్నం శ్రీనివాసులు, సత్యనారాయణ, శేఖర్ బాబు, జీవన్ కుమార్, శ్యాంసుందర్, బత్తుల రవిచంద్ర, కరాటే బ్లాక్ బెల్ట్ రవి గన్, జర్నలిస్టులు ప్రభాకర్ రెడ్డి, తోటపల్లి ఎజ్రా, సుబ్బారాయుడు, మహిళలు, పిల్లలు, రైల్వే విశ్రాంత ఉద్యోగులు, ఆర్మీ విశ్రాంత ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

యువత మొబైల్ వాడకాన్ని తగ్గించాలి

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం: చదువుపై శ్రద్ధ చూపుతూ తగినంత వరకే మొబైల్ వాడకాన్ని ఉపయోగించుకోవాలని సిఐ శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణం ధనుష్ మొబైల్ అధినేత పద్మా కళ్యాణ్ ఆధ్వర్యంలో ఆదివారం హెల్ప్ ఫర్ రన్ కార్యక్రమం డివిఎస్ఆర్ హైస్కూల్ నుండి మొదలై వైఎస్ఆర్ విగ్రహం మీదుగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకుని డివిఎస్ఆర్ హైస్కూల్ వరకు చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపాధిభార్త అంబటి వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ శ్రీహరి, సిఐ శ్రీనివాసులు రెడ్డి, నగర కమిషనర్ బాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమాన్ని చేసినందుకు ధనుష్ మొబైల్ యాజమాన్యాన్ని అతిథులు అభినందించారు. అనంతరం రన్నింగ్ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన ముగ్గురిని ఎంపిక చేసి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిధిలోని యువకులు పాల్గొన్నారు.

సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు

ప్రజాశక్తి-కలిగిరి : మండలంలో 50శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం.సురేష్ బాబు కోరారు. కలిగిరి మండలానికి మొదటి విడతగా జీలుగ 20 క్వింటాలు, జనుము 124 క్వింటాలు, పిల్లిపెసర 92 క్వింటాలు మంజూరయ్యాయి. ఈ పచ్చిరొట్ట విత్తనాలు తీసుకొని తమ భూముల్లో వేసుకొని మొదటి పూత వచ్చినప్పుడు భూమిలో తొక్కించి వేసి భూములను సారవంతం చేసుకుని ఎరువుల పైన పెట్టే ఖర్చు తగ్గించుకొని సాగు ఖర్చులు కూడా తగ్గించుకొని అధిక ఆదాయం పొందాలని తెలిపారు. ఈ విత్తనాలు సబ్సిడీతో కావాల్సిన రైతులు తమ పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాల / సచివాలయాలలో ఉన్న వ్యవసాయ / ఉద్యానశాఖ సహాయకులను కలిసి వారికి తమ ఆధార్, పొలం పాసుపుస్తకం ఆధార్‌తో లింక్ కాబడిన మొబైల్ తీసుకొని వెళ్లవలసిందిగా కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : రాష్ట్ర చేనేత శాఖ డైరెక్టర్ తాళ్ల స్వామి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరాన్ని సుశీల నేత్రాలయ వైద్యులతో ఆదివారం బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలోని రామకృష్ణ నగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా తాళ్ల స్వామి మాట్లాడుతూ నెల్లూరు సుశీల నేత్రాలయం వైద్య బృందం చే నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది కి పైగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షలు నిర్వహించుకున్న వారిలో సుమారు 50 మందికి కంటి ఆపరేషన్లు చేయాలని వైద్యులు నిర్ధారించారు. సుశీల నేత్రాలయం వారు ఆపరేషన్ చేయించుకునే వారిని ఆసుపత్రి వాహనాలలో తీసుకెళ్లి ఆపరేషన్ చేసిన తరువాత తిరిగి వారి ఇంటి వద్దకు చేరేంతవరకు మొత్తం ఖర్చులను ఆసుపత్రి యాజమాన్యమే భరిస్తుందన్నారు. బుచ్చి పట్టణంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినందుకు సుశీల నేత్రాలయ యాజమాన్యం పి.సుధాకరరావుకు, వైద్య సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, 17వ వార్డు కౌన్సిలర్ తాళ్ల వైష్ణవి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను కాపాడండి..

ప్రజాశక్తి-కోవూరు : ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను కాపాడండి అని ఏపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ ఆప్టా జిల్లా అధ్యక్షుడు దేవర చిన్నబాబు బచ్చు అన్నారు. రాష్ట్రంలో జీఓ 117కు ప్రత్యామ్నాయం తెస్తున్న మార్పుల్లో భాగంగా ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలలను 1, 2 తరగతులతో ఏర్పాటు చేసి, అందులో 1:30 ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఏర్పాటు చేశారని తెలిపారు. ఫౌండేషన్ ప్రాథమిక పాఠశాలలో కూడా 1:20 ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి ప్రకారం పోస్టులు కేటాయింపు జరగాలని ఏపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జి.ఎస్ గణపతి రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ప్రకాష్ రావు రాత పూర్వకంగా పాఠశాల విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు, ప్రాథమిక విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ, డైరెక్టర్‌కు ప్రాతినిధ్యం చేశారు. ఆదర్శ ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులను సెకండరీ గ్రేడ్ టీచర్లకు ప్రమోషన్ కల్పించి నియమించాలని వారు డిమాండ్ చేశారు.

భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి

నెల్లూరు నగర కార్పొరేషన్ కమిషనర్ వై ఒ నందన్

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి-నెల్లూరు

నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో నూతన భవనాలు, అపార్టుమెంట్లు నిర్మాణ పనులు చకచకా సాగుతున్నాయి. నూతన భవన నిర్మాణాలకు,టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. ఇదిలా ఉంటే నూతన భవన నిర్మాణం కోసం టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా ప్లానింగ్‌లో చూపించిన కొలతలకు పూర్తిగా విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ నిర్మాణాలపై కార్పొరేషన్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో కమిషనర్ వై ఒ నందన్ మాటల్లో ...

ప్రశ్న. టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అనుమతులు తీసుకున్న వాటికి విరుద్ధంగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. కొన్ని డివిజన్లలో వీధి రోడ్లను భవన యజమానులు ర్యాంపులు, మెట్లు తదితర నిర్మాణాలు చేపట్టి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారు. వీటన్నింటి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు. నగర పాలక సంస్థలోని టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నగరంలో నిర్మించిన అన్ని భవనములకు ఛార్జ్‌షీట్లు దాఖలు చేయాలని సిబ్బందికి సూచనలు చేశాం. ఛార్జ్‌షీట్ల దాఖలా అనంతరం తీసుకోవాల్సిన చర్యలను వేగవంతం చేస్తున్నాం. ప్రధాన డ్రెయిన్ కాలువలపై ఎలాంటి ర్యాంపులు, మెట్లు తదితర నిర్మాణాలు జరగకుండా పర్యవేక్షణ చేయాలని సిబ్బందికి సూచనలు చేశాం. డ్రెయిను కాలువల పూడికతీత పనులకు అటువంటి నిర్మాణాలు అడ్డంకిగా మారకుండా పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నాం. నగరంలో నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం వారి అనుమతుల ప్రకారమే భవనముల నిర్మాణం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని, నిర్మాణాలను పిల్లర్ల స్టేజిలోని గుర్తించి అనుమతుల ప్రకారం నిర్మించనిచో వెంటనే నిర్మాణ పనులను నిలుపుదల చేయాల్సిందిగా ఆదేశించారు. ట్రాఫిక్‌కు అడ్డంకిగా రోడ్లపై ఉన్న ర్యాంపులను తొలగించేలా చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో వీధులలో ఉన్న నిరుపయోగమైన వాహనాలను పోలీసు వారి సహాయముతో వెంటనే తొలగించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యము లేకుండా తగు చర్యలు తీసుకున్నాం. నగరవ్యాప్తంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు లేకుండా పర్యవేక్షించాలని, అనుమతులు లేని ప్రచార సామాగ్రిని వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశాం.

ప్రశ్న. నగరంలోని కొన్ని డివిజన్లలో పార్కులల్లో మౌలిక వసతులు లేకపోవడంతో నిరుపయోగం దర్శనమిస్తున్నాయి. కొన్ని పార్కుల్లో పిల్లలు సేద తీరేందుకు, ఆటలాడుకొనేందుకు అవసరమైన ఆట వస్తువులు, క్రీడా పరికరాలు, వ్యాయామ సౌకర్యాలను, పాదచారుల ట్రాక్, పచ్చదనం, పెయింటింగ్, బెంచీలు లేక అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు. పట్టణ పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ఆలోచనల మేరకు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కులలో జిమ్ పరికరాలు, పచ్చదనం, పెయింటింగ్ తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. 4, 5, 9 డివిజన్ల పరిధిలోని జాకీర్ హుస్సేన్ నగర, రేబాల వారి వీధి పరిసర ప్రాంతాలలో పార్కులను అభివృద్ధి చేసి పార్కులలో అవసరమైన ఆట వస్తువులు, క్రీడా పరికరాలు, వ్యాయామ సౌకర్యాలను, పాదచారుల ట్రాక్, పచ్చదనం, పెయింటింగ్, బెంచీలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్కులను అభివృద్ధి చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న. నగరంలో ప్రధానంగా దోమల సమస్య ఎక్కువగా ఉంది. ఈ దోమల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు. గతంలో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమం చేపట్టేవారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం నగర పాలక సంస్థ పరిధిలో నిర్వహిస్తున్నట్లు ఎక్కడా కనిపించడం లేదు. మీ హయాంలో అయినా దోమల నివారణకు చర్యలు తీసుకుంటారా..?

జవాబు. నగరవ్యాప్తంగా ప్రణాళికా బద్ధమైన పారిశుధ్య నిర్వహణకు, దోమల నిర్మూలనకు ప్రతిష్టాత్మక చేపట్టిన భూగర్భ డ్రెయిన్ వ్యవస్థలో అన్ని గృహాలను అనుసంధానం చేసి, పరిశుభ్రమైన నగరంలా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో ప్రధాన డ్రెను కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత క్రమం తప్పకుండా జరపాలని సూచించారు. అవసరమైన అన్ని ప్రాంతాల్లో డ్రెయిను కాలువల నిర్మాణాలకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించాం. దోమల నివారణలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రతిఒక్కరూ తమ స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, గేటు ఏర్పాటు, తగిన రక్షణ చర్యలను తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు దోహదపడాలని సూచనలు చేశాం.

2న ఉచిత చిత్రకళ తరగతులు



ప్రజాశక్తి - ఉదయగిరి

ఉచిత చిత్రకళ తరగతులను మే 2వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆర్‌టిసి కండక్టర్ కళా కారుడు చిత్ర కారుడు వై.సుదర్శన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ మెట్టప్రాంత విద్యార్థులు, యువతను దృష్టిలో ఉంచుకొని ఉచిత చిత్రకళ తరగతులు ప్రారంభం చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. చిత్రకళను నేర్చుకునేందుకు చిత్రకారులు ఎంపిక ఏప్రిల్ 30వ తేదీన స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులు యువత తల్లిదండ్రులతో సమావేశం జరుగుతుందన్నారు. అక్కడ వచ్చిన విద్యార్థులను ఆసక్తి గల యువతని బట్టి వారిని కేటగిరీలుగా విభజన చేసి వారికి మే 2వ తేదీ నుండి క్లాసులు ఇవ్వడం జరుగుతుందన్నారు. చిన్న పిల్లలకి ఒక టైం మధ్యతరగతి పిల్లలకి మరొకటై 8, 9, 10 సంవత్సరాలు వారికి వేరొక సమయం కేటాయించే విధంగా ఆరోజు విభజించబడుతుందని కావున విద్యార్థులు వారి తల్లిదండ్రులు వచ్చి ఆరోజు ప్రోగ్రాం పాల్గొని పిల్లలకు సంబంధించి సమయాలను ఎంపిక చేసుకోవాలన్నారు. ఎవరి అర్హతను బట్టి వారికి వారి వారి వయసును బట్టి వాళ్ళ అర్హతను బట్టి కోచింగ్ ఇవ్వబడుతుందని వారికి కావాల్సిన మెటీరియల్ పెన్సిల్ చార్ట్ పెయింట్స్‌లను కాకర్ల చారిటబుల్ ట్రస్టు నుండి అక్కడికి వచ్చే ప్రతి కళాకారులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా కళాకారుడు చిత్రకారుడు తను వేసిన తన చిత్రాలు తీసుకొచ్చి ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ఇంజనీరింగ్, సైన్స్ తదితర విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని జ్ఞానాన్ని పెంపొందిస్తుందని ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



ఆధార్ అప్‌డేట్‌తో ఇబ్బందులు

ప్రజాశక్తి-ఉదయగిరి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రేషన్ ఈ-కెవైసి సర్వేలో పది సంవత్సరాలు పూర్తయిన పిల్లల కాలం చెల్లిన ఆధార్‌లు నమోదు కాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రేషన్ లబ్ధిదారుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ సర్వేలో సంబంధిత అధికారులు చొరవ తీసుకోకపోవడంతో సర్వేతో తలెత్తే సమస్యలతో రేషన్ లబ్ధిదారులు భయాందోళన చెందుతున్నారు. 30వ తేదీకి గడువు ముగియడంతో రేషన్ లబ్ధిదారులు మరింత భయాందోళన మొదలైంది ఇంతవరకు సజావుగా సాగుతున్న ఆధార్ ప్రస్తుతం చేపడుతున్న ఈ - కెవైసి సర్వేలో 10 సంవత్సరాలు నిండిన ఆధార్ కార్డులు పనిచేయకపోవడం ప్రయివేట్ ఏజెన్సీ ఒకటే ఉండటంతో రోజుల తరబడి కాలు అరిగేలా తిరుగుతున్న ఆధార్ అప్డేట్ ఆలస్యం అవుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తుది గడువు ముగియకముందే మేలో వచ్చే రేషన్ పంపిణీ ఆగకుండా చర్యలు తీసుకొని తమ ఆధార్ కార్డు అప్డేట్‌లను సచివాలయంలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం చేపట్టే ఈ సర్వే చేపట్టేలా చర్యలు తీసుకోవాలని మండలంలోని పలువురు లబ్ధిదారులు కోరుతున్నారు.

ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు అందజేత



ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణంలోని మినీ స్టేడియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 155 ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్లను దివ్యాంగులకు ఆదివారం పంపిణీ చేశారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, తదితరులు ఈ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. దివ్యాంగులు ఒకచోట నుండి మరొక చోటకు సులభంగా వెళ్లాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. దివ్యాంగులైన ప్రతి ఒక్కరికీ ట్రై సైకిల్స్ పంపిణీ చేస్తానని తెలిపారు.

మంచిమాట కార్యక్రమం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

తెలుగు భారతి సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతినెలా నిర్వహించే మంచి మాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలఘునాథ స్వామి దేవాలయంలోని కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ మేరకు "ధ్యానం జీవితం" "మానవసేవయే మాధవ సేవ" అనే అంశం గురించి నిత్యాన్నదాత శ్రీ సాంబశివ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, తెలుగు భారతి సేవాసమితి ఆత్మీయ సలహాదారు శ్రీ కంచి పరమేశ్వర రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగు భారతి సేవాసమితి అధ్యక్షులు సోమవరపు సుబ్బరాయుడు, ప్రధాన కార్యదర్శి అన్నపురెడ్డి పెద వేంకటరెడ్డి, తెలుగు భారతి సేవాసమితి ప్రతినిధులు గోవిందరెడ్డి, వేంకటేశ్వర్లు, డాక్టర్ శ్రీనివాసులు, యానాది రెడ్డి, రమణయ్య, శేషారెడ్డి, రాఘవేంద్రరావు, కుడుముల సుదాకర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి నరసింహారెడ్డి, నారాయణ రావు, రామయ్యస్వామి, ఒమ్మిన సుబ్రమణ్యం, సుబ్బయ్య, రామమోహన్ రెడ్డి, రామిరెడ్డి, రవీంద్రకుమార్, శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



'ఉండి' ఎంఎల్ఎ వ్యాఖ్యలపై సిపిఎం ఖండన

ప్రజాశక్తి-నెల్లూరు : పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలంలో పేదల ఇళ్లు అన్యాయంగా కూల్చి వేసిన దానిపై మాట్లాడిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుపై ఉండి నియోజకవర్గ ఎంఎల్ఎ రఘురామ కృష్ణమరాజు అనుచితంగా మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా సెక్రటేరియట్ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు ఆదివారం సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో సమావేశంలో నిర్వహించారు. అనంతరం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ మే డేను అన్ని గ్రామాల్లో జయప్రదం చేయాలన్నారు. నెల్లూరులో జరుగుతున్న ప్రదర్శనలో పాల్గొనాలని, మే 6న టౌన్ హాల్లో జరుగుతున్న బుద్ధం చరణం గచ్ఛామి అనే అంబేద్కర్ నాటకాన్ని మండలం నుంచి ఎక్కువ మంది పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రూరల్ మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్, మండల కమిటీ సభ్యులు శ్రీపతి వెంకయ్య, జాన లక్ష్మీప్రసాద్, పర్చూరు ప్రభాకర్, గడ్డం వెంకటేశ్వర్లు, శ్రీపతి దయాకర్ తదితరులున్నారు.

పాఠశాలలను ముక్కలు చేయొద్దు..

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

స్కూల్ మెర్జింగ్ పేరుతో పాఠశాలలను ముక్కలుగా చేయడం సరికాదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ అన్నారు. ఆదివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో భాగంగా మూడవరోజు ఆదివారం సిపిఎం కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్ విచ్చేసి ప్రసంగించారు. గడిచిన విద్యా సంవత్సరానికి గానూ కూటమి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విద్యార్థులకు చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలను పెడచెవిన పెట్టి ప్రయివేటు పాఠశాలలైన చైతన్య నారాయణ వంటి వాటిపై దృష్టి సారించలేకపోవడం వల్ల ఆ పాఠశాలలో విచ్చలవిడితనంగా వివరిస్తున్నాయన్నారు. విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని రాబోయే విద్యా సంవత్సరంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో అనేక సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆందోళన బాట పట్టనుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు తల్లికి వందనం పథకం విద్యార్థులకు ఇవ్వకపోవడంపై అసహనం వ్యక్తపరిచారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తల్లికి వందనం ఇవ్వకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. వెంటనే విద్యార్థుల తల్లులకు తల్లికి వందనం పథకం నగదు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యేందుకు హాల్ టికెట్ ఇవ్వకుండా ఫీజు చెల్లించమని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ నగదును విడుదల చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను డిమాండ్ చేశారు. ఎలిమెంటరీ స్కూల్ పిల్లలను ఫౌండేషన్ స్కూల్‌కు తరలించడం సరికాదన్నారు. భవిష్యత్తులో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రంగా ఆందోళన చేపడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా బాధ్యులు గోగుల శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వెన్ను నరేంద్ర, విక్రమ్, దేవేంద్ర, యశ్వంత్, యగ్నేష్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్

మత్స్యకారులకు టిడిపి అండ..

ప్రజాశక్తి-విడవలూరు

నాటి నందమూరి తారకరామారావు నుంచి నేటి చంద్రబాబు నాయుడు వరకు మత్స్యకారుల సంక్షేమానికి పాటు పడుతున్నది తెలుగుదేశం పార్టీయేనని కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. విడవలూరు మండలం ఊటుకూరు పెద్దపాళెం గ్రామంలో ఆమె "మత్స్యకార సేవలో" పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఊటుకూరు పెద్దపాళెం గ్రామానికి విచ్చేసిన ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డికి స్థానిక మత్స్యకారులు ఘనస్వాగతం పలికి స్థానిక వెంకయ్య స్వామీ ఆలయంలో పూజలు నిర్వహించారు. మహిళలు అడుగడుగునా మంగళ హారతులతో ఆత్మీయ స్వాగతం పలికారు. దారి పొడుగూతా పూలవర్షం కురిపించి అభిమానాన్ని చాటుకుంటూ విజయోత్సవ ర్యాలీని తలపించారు. భారీ గజమాల, వినూత్నంగా చేపలమాలతో మత్స్యకార నాయకులు ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ రూ.20వేల వేట నిషేధకాల భృతిని గంగపుత్రుల ఖాతాలలో జమ చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కోవూరు నియోజకవర్గ మత్స్యకారుల తరపున ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక పరిస్థితి అనుకూలించక పోయినా ఓ వైపు అభివృద్ధి మరో వైపు సంక్షేమ పథకాలు అమలు చేయగల సామర్థ్యం చంద్రబాబు నాయుడుకే ఉందన్నారు. మత్స్యకారుల జీవితాలలో వెలుగులు నింపాలన్నదే చంద్రబాబు నాయుడు ఆశయమన్నారు. ఫిషరీస్ అధికారులు చొరవ తీసుకొని మత్స్యకారుల సంక్షేమం కోసం ఉద్దేశించిన ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని కోరారు. స్థానిక సర్పంచ్ చేసిన వినతిపై స్పందిస్తూ మత్స్య సంపదను సకాలంలో మార్కెట్‌కు తరలించుకునేందుకు వీలుగా సముద్రం వరకు సిమెంట్ రోడ్డు వేస్తానని హామీనిచ్చారు. గతంలో కోవూరు నియోజకవర్గంలో 3వేల 28 మందికి రూ.3కోట్ల 2లక్షల 80వేలు ఇస్తే, కూటమి ప్రభుత్వం వచ్చాక 3102 మంది గంగపుత్రులకు రూ.6 కోట్ల 20లక్షల 40వేలు వేట విరామ భృతిగా ఇవ్వడం తమ ప్రభుత్వ ఘనతగా కొనియాడారు. అనంతరం అధికారుల సమక్షంలో మత్స్యకార నాయకులకు రూ.6 కోట్ల 20 లక్షల 40 వేల రూపాయల విలువ చేసే చెక్కు అందించారు. స్థానిక నాయకులు అధికారులు పరస్పర సమన్వయంతో గ్రామాభివృద్ధికి పాటు పడాలని హితోపదేశం చేశారు. కార్యక్రమంలో స్థానిక మత్స్యకార నాయకులు నాయకులతో పాటు ఫిషరీస్ జెడి నాగేశ్వరరావు, బుచ్చి ఛైర్ పర్సన్, వైస్ ఛైర్మెన్లు మోర్ల సుప్రజ, నస్రీన్ ఖాన్, ఊటుకూరు పెద్దపాళెం గ్రామ సర్పంచ్ మేకల శేషమ్మ, ఎంపిటిసి బుజ్జమ్మ, జెడ్‌పిటిసి తుమ్మల లక్ష్మయ్య, టిడిపి నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు చెముకుల శ్రీనివాసులు, పెన్నాడెల్టా ఛైర్మెన్ జెట్టి రాజగోపాల్ రెడ్డి, దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, ఇందుకూరుపేట మండల అధ్యక్షులు రావెళ్ల వీరేంద్రనాయుడు, కోడూరు కమలాకర్ రెడ్డి, టిడిపి మండల నాయకులు పాశం శ్రీహరి రెడ్డి, అడపాల శ్రీధర్ రెడ్డి కోవూరు టిడిపి నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి ఎంపిటిసి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్ఎను చేపలమాలలతో సన్మానిస్తున్న మత్స్యకారులు

ముగ్గురు నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి-దుత్తలూరు

మండలంలోని నందిపాడు సమీపంలో అటవీ పందిని తరలిస్తున్న ముగ్గిరిని అరెస్ట్ చేసినట్లు ఉదయగిరి అటవీశాఖ రేంజ్ అధికారి బిఎస్ కుమార్ రాజా ఆదివారం తెలిపారు. అటవీ శాఖ సిబ్బంది వాహనాలను తనిఖీ చేస్తుండగా ఉదయగిరి మండలం దాసరి పల్లి నుండి దుత్తలూరు మీదుగా తరలిస్తున్న ముగ్గురు నిందితులు ఆటోలో అటవీ పంది కళేబరాన్ని తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వీరు నందిపాడులో ఒ రైతు పొలంలో పని చేస్తూ అక్కడికి తరలిస్తూ పట్టుబడ్డారని ఈ మేరకు పంది మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసినట్లు ఆయన తెలిపారు. అందులో భాగంగా ఆటో సీజ్ చేశామని విచారణ జరిపి కేసు నమోదు చేస్తామని తెలిపారు.



తులసీరాంకు 590 మార్కులు

- విద్యార్థిని సన్మానించిన ఎంఎల్ఎ ప్రశాంతిరెడ్డి

ప్రజాశక్తి-విడవలూరు

10వ తరగతిలో 590 మార్కులు సాధించిన ఊటుకూరు పెద్దపాళెం గ్రామానికి చెందిన మీనంగారి తులసీరాం అనే విద్యార్థిని ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సన్మానించారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా తులసీరాంను ఆదర్శంగా తీసుకొని కష్టపడి చదవాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఊటుకూరు పెద్దపాళెం గ్రామానికి చెందిన విద్యార్థులు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితో గ్రూప్ ఫోటో దిగారు.

ఎంఎల్ఎ పరామర్శ



ప్రజాశక్తి-కావలి

ఇటీవల మృతి చెందిన డిబిఎస్ కళాశాల చైర్మన్ దామిశెట్టి శ్రీనివాస నాయుడు కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ఆదివారం పరామర్శించారు. ముందుగా శ్రీనివాస నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, గుంటుపల్లి రాజ్ కుమార్ చౌదరి, పొట్లూరి శ్రీనివాసులు, స్థానిక వార్డు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'విపిఆర్' సహకారం మరువలేనిది

- ఆత్మీయ సమావేశంలో కావలి ఎంఎల్ఎ కావ్య కృష్ణారెడ్డి



ప్రజాశక్తి-కావలి : కావలి నియోజకవర్గ అభివృద్ధికి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిదని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం కావలి పట్టణంలోని మినీ స్టేడియంలో టిడిపి, బిజెపి, జనసేన పార్టీల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు బీద రవిచంద్ర, కావలి నియోజకవర్గం జనసేన ఇన్చార్జి అలహరి సుధాకర్, బిజెపి కావలి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ సివిసి సత్యం, బిజెపి జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కావలి ఎంఎల్ఎ కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ముసునూరులో పమిడి కాలేజీ స్కూల్ దగ్గర హైవే బుడంగుంట మీదుగా జగనన్న కాలనీ వైపు ఎక్కేలా కావలి బైపాస్ కు, కావలి ట్రంక్ రోడ్డు విస్తరణకు ఎంపి కృషి చేయడం జరిగిందని తెలిపారు. అతిపెద్ద బిపిసిఎల్ పరిశ్రమ రావడానికి కృషి చేసింది కూడా ఎంపి వేమిరెడ్డి అని తెలిపారు. కావలి ట్రంక్ రోడ్డు విస్తరణలో డ్రైన్ టు డ్రైన్‌కు రూ.17 కోట్ల మంజూరై టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. బైపాస్ కోసం అధికారులు వచ్చి పరిశీలించడం జరిగిందన్నారు. త్వరలోనే బైపాస్ కూడా మంజూరు కాబోతుందని తెలిపారు. అల్లూరు ప్రాంతంలో కూడా బైపాస్ రావాల్సిన అవసరం ఉందని, అల్లూరుకు ఆ రోడ్డు కూడా వేస్తే మన కావలిలో ఇక రోడ్ల పరంగా ప్రజలకు ఏ రకమైన అసౌకర్యంగా జరగకుండా ఉంటుందని తెలిపారు. ఆ రోడ్డు కూడా వచ్చేలా చూడాలని ఎంపిని కోరారు. అల్లూరు నగర పంచాయతీకి సెంట్రల్ లైటింగ్ కూడా ఎంపి చొరవతో మంజూరు కావడం జరిగిందని తెలిపారు. ఆగిపోయిన దామవరం ఎయిర్ పోర్టు భూసేకరణ ప్రక్రియ ప్రారంభం అయిందని తెలిపారు. రూ.30కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. బిట్రగుంట రైల్వే అభివృద్ధికి కూడా కృషి చేస్తున్నామని తెలిపారు. మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కును ఇక్కడ పెడితే 10వేల మందికి ఉద్యోగాలు అవకాశాలు వచ్చే అవకాశం ఉంటుందని, తాను ముఖ్యమంత్రికి నివేదికలు ఇవ్వడం జరిగిందన్నారు. వేమిరెడ్డి, బీద రవిచంద్ర, బీద మస్తాన్ రావుతో కలిసి తప్పకుండా అతి తొందరలో బిట్రగుంటకు కూడా ఒక శుభవార్తని అందించే కార్యక్రమానికి నాంది పలకబోతున్నామన్నారు. ఇద్దరి ధ్యేయం ఒకటే అని ఈ కావలిని అభివృద్ధి చేయటమే అని, అది నిరంతరం జరుగుతుందన్నారు. ఎంఎల్ఏగా 10నెలల కాలం పూర్తయిందని, కార్యకర్తల జీవితాల్లో వెలుగులు నింపడానికి, వారి సంక్షేమానికి త్వరలో ఒక కార్యాచరణ చేపట్టి, సహకారాలు అందిస్తామని తెలిపారు. కావలి గడ్డ మీద చేసే ప్రతి పని బిజెపి, జనసేన, తెలుగుదేశం కార్యకర్తలకు ఇచ్చేలా చూస్తానని తెలిపారు. కావలిని కనకపట్టణం చేయడమే తన ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.